వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణం

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 10: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ వెలుపలి ప్రకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. భక్తులు పాల్గొని కల్యాణ తంతును వీక్షించారు. స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు వైభవంగా సాగాయి. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్‌సేవ చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. రెండో శనివారం సెలవు కావడంతో స్వయంభూ పంచ నారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దాంతో తిరుమాడవీధులు, క్యూ కాంప్లెక్స్ సందడిగా కనిపించాయి. స్వామివారి ధర్మదర్శనానికి గంట, వీఐపీ దర్శనానికి అరగంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.37,46,489 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని సాంస్కృతిక మండపలంలో హైదరాబాద్‌కు చెందిన భాస్కర డాన్స్ అకాడమీ, కొండాపూర్‌కు చెందిన సురేఖ డాన్స్ అకాడమీ వారి నాట్య ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మా స్కూల్‌కు టీచర్లను నియమించండి ప్లీజ్

- తుక్కాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వేడుకోలు
- పాఠాలు చెబుతున్న విద్యార్థులు

తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న విద్యార్థిని

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 10: అధికారులూ.. తమ పాఠశాలకు టీచర్లను నియమించి తమకు పాఠాలు బోధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం తుక్కాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వేడుకుంటున్నారు. తమ పాఠశాలలో గతంలో 33 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారని, తాజా బదిలీల్లో ఆ ఇద్దరూ ఇతర పాఠశాలలకు వెళ్లారని తెలిపారు. మరొక ఉపాధ్యాయురాలు ఇక్కడికి బదిలీపై వచ్చినా.. ఇటీవల ఆమె కూడా జూలై 29న పదోన్నతిపై తుర్కపల్లి మండలానికి వెళ్లారు. ఆ తర్వాత తమ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించలేదని, ప్రస్తుతం పాఠశాలలో 17 మంది విద్యార్థులం చదువుకుంటున్నామని, రోజూ బడికి వచ్చి ఏమీ నేర్చుకోకుండా వెళ్లిపోతున్నామని వాపోయారు. పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులే పాఠాలు చదువుకుని ఇంటి బాట పడుతున్నట్టు పేర్కొన్నారు. టీచర్లు లేక తమ పిల్లలు చదువుకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉండటంతో తుక్కాపురం ప్రాథమిక పాఠశాలకు టీచర్లను నియమించలేకపోతున్నామని ఎంఈవో శ్రీధర్ వివరించారు. ఈ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సాధ్యమైనంత త్వరగా తుక్కాపురం పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పారు.

సిలివేరి శ్వేతకు డాక్టరేట్

సిలివేరి శ్వేత

రామన్నపేట, ఆగస్టు 10 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన సిలివేరి శ్వేత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో 'లా పవర్ సర్క్యూట్స్ ఫర్ ఎంబెడెడ్ అండ్ వీఎల్ఎస్ఐ అప్లికేషన్స్' అంశంపై ప్రొఫెసర్ నూక శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆమె పరిశోధన పూర్తి చేయడంతో యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ పరిశోధనాంశం ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్ జర్నల్స్ స్కూపస్, ఎస్‌సీఐలో కూడా ప్రచురితమైంది. శ్వేత జన్మస్థలం సంగారెడ్డి జిల్లా సదాశివపేట కాగా ఈమె పాఠశాల విద్యను అక్కడే పూర్తి చేశారు. ఇంటర్మీడియట్ సంగారెడ్డిలో, బీటెక్ ముత్తంగిలో చదివారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఎంఈ ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీలో చేశారు. వెల్లంకి గ్రామానికి చెందిన వనం రవీందర్‌తో ఆమె వివాహమైంది. ఆమె ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. శ్వేతను పలువురు అభినందించారు.

భక్తులకు అన్నదానం

భువనగిరి కలెక్టరేట్ : నమాత్‌పల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, దాత మణిమాల ప్రసాద్‌రావు సహకారంతో శనివారం అన్నదానం నిర్వహించారు. పూజారి జోషి పవన్‌కుమార్ శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే పైళ్ల జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ
- రక్తదానం, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ

భువనగిరిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 10 : భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం బీఆర్‌ఎస్ పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కుమ్మరివాడలోని గణపతి దేవాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రైతుబజార్ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రైతుబజార్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. 100 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పైళ్ల శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి, భావితరాల భవిష్యత్తు కోసం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, రైతుబంధు సమితి జిల్లా మాజీ కన్వీనర్ కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బీఆర్‌ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ. కిరణ్‌కుమార్, జనగాం పాండు, పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎడ్ల సత్తిరెడ్డి, బీరు మల్లయ్య, అతికం లక్ష్మీనారాయణ, ఖాజా అజీమొద్దీన్, దిడ్డికాడి భగత్, పంగరెక్క స్వామి, ఇట్టబోయిన గోపాల్, సురపల్లి రమేశ్, ర్యాకల శ్రీనివాస్, కంచి మల్లయ్య, తుమ్మల పాండు, ఏక్బాల్ చౌదరి, వెల్దుర్తి రఘునందన్, తాడూరు భిక్షపతి, తాడెం రాజశేఖర్, చిందం మల్లికార్జున్, కాలేరు లక్ష్మణ్, బబ్లు, ఖాజం, ఇస్మాయిల్, ముజీబ్, సిల్వేరు మధు, పద్మ, పావని, వనజ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వలిగొండలో..

వలిగొండ : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి, పనుమటి మమతానరేందర్‌రెడ్డి, ముద్దసాని కిరణ్‌రెడ్డి, కొమిరెల్లి సంజీవరెడ్డి, కీసరి రాంరెడ్డి, శ్రీరాముల నాగరాజు, సుర్కంటి లక్ష్మారెడ్డి, ఐయిటిపాముల ప్రభాకర్, కొండూరి వెంకటేశం, పబ్బు స్వామి, జాని అఫ్రోజ్, కేశిరెడ్డి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీబీనగర్ : మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యర్కల సుధాకర్‌గౌడ్, బొక్క జైపాల్‌రెడ్డి, చింతల సుదర్శన్‌రెడ్డి, వాకిటి గణేశ్‌రెడ్డి, మంచాల రవికుమార్, కొలను దేవేందర్‌రెడ్డి, ఆల్వ మోహన్‌రెడ్డి, ఆకుల ప్రభాకర్, జక్కి నగేశ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ

భూదాన్ పోచంపల్లి : పట్టణ కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, దేవర రాయకుమార్, నాయకులు చిలువేరు బాల నరసింహ, గునిగంటి మల్లేశ్, నోముల మాధవరెడ్డి, బత్తుల శ్రీశైలంగౌడ్, సారా బాలయ్యగౌడ్, మన్నె పద్మారెడ్డి, కలుకూరి శ్రీకాంత్, కర్నాటి అంజమ్మ, కుంటోల్ల మహేశ్, మెరుగు జెన్నయ్య, రామసాని చంద్రశేఖర్‌రెడ్డి, పరస మానీ సత్తయ్య, సీత శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు హరిశంకర్‌గౌడ్

నిరుద్యోగులను మోసం చేసేందుకే జాబ్ క్యాలెండర్

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు హరిశంకర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 10 : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసేందుకే జాబ్ క్యాలెండర్ ప్రకటించిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సుదగాని హరి శంకర్‌గౌడ్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగాలకు సీఎం రేవంత్ రెడ్డి నియామకపత్రాలు అందించారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలల గడుస్తున్నా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు విడుతల వారీగా రుణమాఫీ చేస్తున్నారని విమర్శించారు. నేటికీ అర్హులైన రైతుందరికీ రుణమాఫీ కాలేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, జిల్లా నాయకులు కొరె భిక్షపతి, కాంబోజు భానుప్రకాశ్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి, మండలాధ్యక్షులు నాగరాజు, మైసయ్య, సతీశ్, రాంబాబు, విశాల్, వీరారెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

మాదిగల విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి

- మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న

సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

భువనగిరి అర్బన్, ఆగస్టు 10: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ ఈ నెల 13న హైదరాబాద్‌లో జరిగే మాదిగల విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఆయన మాట్లాడారు. గత 70 ఏండ్లుగా ఎస్సీ రిజర్వేషన్లు కొంత మందికే పరిమితమయ్యాయని, ఎస్సీ వర్గీకరణ ద్వారా అందరికీ రిజర్వేషన్ ఫలాలు అంది అంబేద్కర్ ఆశయం నెరవేరుతుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ జరుగకపోతే మాల, మాదిగ ఉప కులాల మధ్య వైషమ్యాలు మరింత పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య, నాయకులు బండారు శివశంకర్, కోళ్ల జహంగీర్, ముక్క శ్రీనివాస్, సగ్గు బాబూరావు, దాసరి గోవర్ధన్, సమ్మయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

ఆత్మకూరు(ఎం), ఆగస్టు10 : మండలంలోని కొరటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శనివారం భువనేశ్వరి గ్రూప్ అధినేత ఆనంద నర్సింహ రూ.15వేల విలువైన ఆంప్లిఫైర్‌ను బహూకరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతకు హెచ్‌ఎం డి.వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, స్వామి, వర ప్రసాద్, జగత్‌సింగ్, మహేశ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

రామన్నపేట, ఆగస్టు10: మండలంలోని సర్నేనిగూడెం గ్రామానికి చెందిన పర్నె నర్సిరెడ్డికి చెందిన ఎద్దు శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. రైతు పశువులను గ్రామ శివారులో మేపుతుండగా ఎద్దు ట్రాన్స్‌ఫారమ్ వద్దగల తీగకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దాంతె తనకు రూ. 60వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు. విద్యుత్, పశువైద్యశాల అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

మోటకొండూర్, ఆగస్టు 10 : విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మోటకొండూరు మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన అయిలీ గిరిధర్ (23) గ్రామపంచాయతీకి సంబంధించిన విధి లైట్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. దాంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో హైదరాబాదులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన గిరిధర్‌ను ఆదుకోవాలని అతడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

- ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరేందర్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 10 : సారా తయారు చేడయం, విక్రయించడం నేరమని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ అన్నారు. శనివారం భువనగిరి మండలంలోని ఆకుతోట బాయి తండా, పచ్చర్లబోడు తండాల్లో సోదాలు చేపట్టారు. సారాయి తాగడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎవరైనా నాటు సారా తయారు చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ కె గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు నీరందించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రామస్తులు

చౌటుప్పల్, ఆగస్టు 10 : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో సాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు శనివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. గ్రామ రైతులు సుమారు 200 ఎకరాల్లో వరి సాగు చేశారని, సాగునీరందక పోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయని తెలిపారు. పిలాయిపల్లి కాల్వ నుంచి పైపులైన్ ద్వారా మూసీ జలాలను తరలించి తమ పంటలను కాపాడాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నీటి పారుదలశాఖ అధికారులకు ఫోన్ చేసి పైపులైన్ వేసేందుకు ఎస్టిమేషన్ వేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వార్డు కౌన్సిలర్ బండమీది మల్లేశ్, నాయకులు ఎర్రగోని లింగస్వామి యాదవ్, రైతులు ఉన్నారు.

మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

యజ్ఞం నిర్వహిస్తున్న భజనమండలి సభ్యులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 10 : పట్టణ కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవాలయ ఆవరణలో శనివారం పాండురంగ స్వామి భజన మండలి 51వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మేలుకొలుపు, అభిషేకం సీతారామచంద్రస్వామి పూజ, భ్రమరాంబ దేవి కుంకుమార్చన, హనుమాన్ పూజ సహస్రనామార్చన, యజ్ఞం, స్వామి వారి ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కండేయ స్వామి దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, భజన మండలి చైర్మన్ చక్రాల నరసింహ, ఉపాధ్యక్షుడు భారత వెంకటేశం ప్రధాన కార్యదర్శి పుప్పాల నాగేశ్వర్, సహాయ కార్యదర్శి దోర్నాల శ్రీనాథ్, కోశాధికారి పండరీనాథ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ సీతారాములు

స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న చెరుపల్లి సీతారాములు

రామన్నపేట, ఆగస్టు10: సీపీఎం కార్యకర్త దివంగత పిట్టల శ్రీనివాస్ ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్మించిన పిట్టల శ్రీనివాస్ స్మారక స్తూపాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 50వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, గాదె నరేందర్, మామిడి వెంకట్‌రెడ్డి, గొరిగె సోములు, కందుల హన్మంతు పాల్గొన్నారు.

ఎన్నికైన పేరెంట్స్ కమిటీ సభ్యులు

గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నిక

అడ్డగూడూరు, ఆగస్టు 10: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీని శనివారం పాఠశాల ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండలంలోని చౌళ్లరామారం గ్రామానికి చెందిన మందుల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా సిర్పంగి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా డప్పు యాదగిరి, కార్యదర్శిగా కూరపాటి సుమలత, సభ్యులుగా సంజీవ, బీరయ్య, యాదగిరి, నర్సింహ, జనార్దన్, వసంత ఎన్నికయ్యారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఆగస్టు10 : మండల కేంద్రానికి చెందిన యాట వేణు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నేతాజీ యువజన మండలి ఆధ్వర్యంలో శనివారం మృతుడి కుటుంబానికి రూ.15 వేలను అందించారు. కార్యక్రమంలో మండలి ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు మురళి, దామోదర్‌రెడ్డి, రాజు, అనిల్, మహేందర్‌రెడ్డి, కిరణ్, సుభాశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ యూసుఫ్

భువనగిరి అర్బన్, ఆగస్టు 10: రాష్ట్రంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో జరిగిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి అవుతున్నప్పటికీ దేశంలో పెట్టుబడిదారీ విధానం నేటికీ కొనసాగుతుందన్నారు. కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చి పెట్టుబడి దారులకు అనుకూలంగా చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ చట్టాలను అమలు చేయాలని, మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేశ్, నాయకులు ఏశాల అశోక్, గనబోయిన వెంకటేశ్, గొరిగె నర్సింహ, రాజు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

విరాళాలు సేకరిస్తున్న రైతుసంఘం నాయకులు

బీబీనగర్, ఆగస్టు 10 : వయనాడ్ వరద బాధితుల కోసం శనివారం మండలంలోని జమీలాపేట గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంత వరద బాధితులకోసం తమ వంతుగా విరాళాలు సేకరించామని, ప్రజల నుంచి అందిన రూ.5,770 బాధితుల నిధికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రేసు రామచంద్రారెడ్డి, నాయకులు చినాల నరసింహ, కడారి నాగరాజు, అనరాసి కార్తీక్, ఊకుట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు

ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 10 : మండల కేంద్రంలోని శివాంజనేయ ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ధ్వజస్తంభం ప్రతిష్ఠోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామ వరలక్ష్మి, ధ్వజస్తంభ దాత లింగాల గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అబ్బయ్య, భాను ప్రకాశ్, బుచ్చిరాములు, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లోకి చొరబడి..

10 తులాల బంగారం, రూ. లక్ష నగదు చోరీ

వివరాలు సేకరిస్తున్న ఏసీపీ రమేశ్‌కుమార్, సీఐ కొండల్‌రావు

మోటకొండూర్, ఆగస్టు 10 : మండలంలోని కాటేపల్లి గ్రామంలో శనివారం పట్టపగలే దొంగలు ఇంట్లోకి చొరబడి నగలు, నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సప్పిడి దేశమ్మ, యాదిరెడ్డి దంపతులు తన కుమారుడితో కలిసి వ్యవసాయ బావి వద్దకు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఉన్న కోడలు ఇంటి తలుపులు పెట్టి ఎదురింట్లోకి వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 10 తులాల బంగారంతో పాటు రూ. లక్ష నగదును ఎత్తుకెళ్లారు. అరగంట తర్వాత ఇంటికి వచ్చిన ఆమె తలుపులు తీసి ఉండడం, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ రమేశ్, సీఐ కొండల్‌రావు, ఎస్ఐ పాండు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. సప్పిడి దేశమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.